AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
19-1-2026 (Monday)
MAIN EDITION

## కాసుల పంట పండించిన బీసీసీఎల్





**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** కోల్ ఇండియా అనుబంధ సంస్థ అయిన భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ ఐపీవోకు వచ్చింది. దేశంలోనే అతిపెద్ద కోకింగ్ బొగ్గు ఉత్పత్తిదారు అయిన బీసీసీఎల్.. పబ్లిక్ ఆఫర్ ద్వారా రూ.1,071 కోట్లు సమీకరించింది. ఈ కంపెనీ షేర్లు సోమవారం బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో లిస్టయ్యాయి. కంపెనీ ఒక్కో షేరు ధరను గరిష్ట ప్రైస్‌బ్యాండ్ వద్ద రూ. 23 కాగా.. 45 వద్ద లిస్టయ్యింది. లిస్టింగ్ తర్వాత రూ.45.09 వద్ద గరిష్టాన్ని తాకిన షేరు ధర ఆ తర్వాత ప్రాఫిట్ బుకింగ్‌తో కాస్త తగ్గింది. ఉదయం 11 గంటల ప్రాంతంలో 86 శాతం లాభంతో 42.78 వద్ద కొనసాగుతోంది.

## ఎంఆర్‌టీటీ విమానాల కొనుగోలుకు ఆమోదం



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** భారత రక్షణ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. 1.1 బిలియన్ డాలర్లతో ఆరు ఎంఆర్‌టీటీ యుద్ధ విమానాల కొనుగోలుకు వాయుసేన ఆమోదం తెలిపింది. తన వ్యూహాత్మక పరిధిని మరింతగా పెంచుకోవడానికి భారత్ ఆరు మల్టీ రోల్ ట్యాంకర్ ట్రాన్స్‌పోర్ట్ విమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. ఎయిర్‌టుఎయిర్ ఇంధనం నింపే సామర్థ్యాలను బలోపేతం చేయడానికి ఈ నిర్ణయం తీసుకుంది.

## కాళేశ్వరం రిపోర్టుపై విచారణ



**అక్షరటుడే, హైదరాబాద్ :** కాళేశ్వరం పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టుపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. కేసీఆర్, హరీష్‌రావు, స్మితా సబర్వాల్, ఎస్కే జోషి పిటిషన్లను విచారించింది. ఘోష్ కమిషన్ రిపోర్టును సవాల్ చేస్తూ గతంలో వారు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయగా.. పిటిషనర్లు రిప్లై ఫైల్ చేశారు.

## కుక్కలను చంపడంపై ఆగ్రహం



**అక్షరటుడే, హైదరాబాద్ :** వీధి కుక్కల్ని చంపడంపై సినీనటి రేణూ దేశాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 కుక్కలలో ఐదు కుక్కలు కరిస్తే అన్నింటిని చంపేయాలా అని ప్రశ్నించారు. కుక్కలతో మృతి చెందిన వారివే ప్రాణాలా?.. రోడ్డు ప్రమాదాలు, దోమలతో చనిపోయినవారివి ప్రాణాలు కావా అన్నారు. ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉందన్నారు.

## నామినేషన్ వేసిన నితిన్ నబిన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి నితిన్ నబీన్ నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ హాజరయ్యారు. ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు. మంగళవారం కొత్త అధ్యక్షుడి పేరును ప్రధాని మోదీ ప్రకటించనున్నారు.

## పలువురు సీఐల బదిలీ

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ఈ మేరకు నగర కమిషనర్ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. నగరంలోని పలు ఠాణాల్లో ఎస్‌హెచ్‌వోలుగా పని చేస్తున్న వారితో పాటు డీఐలు, సైబర్ క్రైం, సీసీఎస్‌లో పని చేస్తున్న వారికి సీపీ స్థానచలనం కలిగించారు. మొత్తం 54 మందిని బదిలీ చేశారు. ఎక్కువ మంది సీసీఎస్, సైబర్ క్రైమ్స్ విభాగం నుంచి అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయడం గమనార్హం. అలాగే 26 మంది సీఐలను సీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఐలు కొత్త పోస్టింగ్‌లో జాయిన్ కావాలన్నారు.

## నైని టెండర్లపై సీబీఐ విచారణ చేపట్టాలి



**అక్షరటుడే, హైదరాబాద్:** నైని బొగ్గు గనుల టెండర్లపై సీబీఐ విచారణ చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి పాలేరు సభలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గద్దెలను కూల్చాలని వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై హరీశ్‌రావు స్పందించారు. తమ పార్టీ గద్దెల జోలికొస్తే సీఎం గద్దె కూలుతుందన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ముందు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మున్సిపోల్స్‌పై ఫోకస్

- ఇన్‌ఛార్జీలను నియమించిన కాంగ్రెస్
- మెజారిటీ స్థానాల్లో గెలుపే లక్ష్యం
- పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్న హస్తం పార్టీ

**మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ఓటర్ల జాబితా, రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. ఎన్నికల సంఘం త్వరలో షెడ్యుల్ విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీ పుర పోరుపై ఫోకస్ పెట్టింది. మెజారిటీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తోంది. మేయర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవులను దక్కించుకోవడానికి కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా మున్సిపల్ ఎన్నికల కోసం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులకు ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగించారు.**

**– అక్షరటుడే, హైదరాబాదర్ ప్రతినిధి**




రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజారిటీ స్థానాల్లో విజయం సాధించింది. మున్సిపాలిటీల్లో సైతం సత్తా చాటాలని హస్తం పార్టీ భావిస్తోంది. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు కొన్ని రోజులుగా బల్దియాల్లో మకాం వేశారు. తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో నిత్యం పర్యటిస్తున్నారు. భారీగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఆ పార్టీ నాయకులు మరింత జోరు పెంచారు. ఈ క్రమంలో తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌ఛార్జీలను నియమించారు.

### ఇన్‌ఛార్జీలు వీరే..

నిజామాబాద్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆదిలాబాద్ సుదర్శన్ రెడ్డి, మల్కాజ్‌గిరి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మెదక్ వివేక్, చేవెళ్ల శ్రీధర్‌బాబు, కరీంనగర్ తుమ్మల నాగేశ్వరరావు, నల్గొండ అడ్లూరి లక్ష్మణ్, పెద్దపల్లి జూపల్లి కృష్ణారావు, భువనగిరి సీతక్క, వరంగల్ పొంగులేటి, మహబూబ్‌నగర్ పొన్నం ప్రభాకర్, జహీరాబాద్ అజహరుద్దీన్, మహబూబ్‌నగర్ దామోదర రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ వాకిటి శ్రీహరి, ఖమ్మం బాధ్యతలను మంత్రి కొండా సురేఖ అప్పగించారు.

### సన్నాహక సమావేశాలు

ఇన్‌ఛార్జీలుగా నియమితులైన వారు ఆయా పార్లమెంట్ పరిధిలో అందుబాటులో ఉండాలని సీఎం సూచించారు. మంగళవారం నుంచి పార్లమెంట్ సెగ్మెంట్లలో మున్సిపాలిటీల వారీగా సన్నాహక సమావేశాలు పెట్టాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో చేరికలను ప్రోత్సహించాలన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు దావోస్‌కు వెళ్లనున్నారు. ఆయన ఫిబ్రవరి 1న హైదరాబాద్‌కు తిరిగి వస్తారు. ఆ లోగా పుర పోరుకు సంబంధించి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడానికి సిద్ధం అవుతోంది.

దీంతో కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశిస్తున్న వారు నేతల చుట్టూ తిరుగుతున్నారు. అయితే పార్టీ టికెట్ల కేటాయింపు, ప్రచారం, ఇతర కార్యకలాపాలను ఇన్‌ఛార్జీలు పర్యవేక్షించనున్నారు. అన్ని విధాలుగా బలమైన అభ్యర్థులను బరిలో నిలపాలని కాంగ్రెస్ యోచిస్తోంది.



## మేడారం గద్దెల పునఃప్రారంభం..

**అక్షరటుడే, ములుగు:** మేడారం సమ్మక్కసారలమ్మ గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం అధికారికంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆదివాసీలు గిరిజన సంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో ఘనస్వాగతం పలికారు. సీఎం వెంట కుటుంబ సభ్యులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు కూడా మేడారానికి చేరుకున్నారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబంతో కలిసి వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవతలకు సారె సమర్పించి, మనవడు రేయాన్ష్‌తో కలిసి తులాభారం వేసి నిలువెత్తు బంగారాన్ని సమర్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్: బండి



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శలు చేశారు. ప్రజలు ఆ పార్టీని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ఆయన పోస్ట్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సీపీఐ సభలో మాట్లాడుతూ.. బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనికి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్‌ను బ్రిటిష్ పౌరుడు స్థాపించారని పేర్కొన్నారు. ఆ విషయాన్ని రేవంత్ రెడ్డి మర్చిపోయారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఐఎన్‌సీ “ఇటలీ నేషనల్ కాంగ్రెస్” గా రూపాంతరం చెందిందన్నారు. ‘ఎండీఎన్ఆర్ఈజీఎస్ పేరు గురించి కాంగ్రెస్ ఏడుస్తోంది, కానీ తాము మహాత్మా గాంధీ నిజమైన కోరిక గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నాం’ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత కాంగ్రెస్‌ను రద్దు చేయాలని గాంధీజీ కోరుకున్నారని చెప్పారు. కాంగ్రెస్‌ను పదే పదే తిరస్కరించడం ద్వారా, ప్రజలు గాంధీజీ దార్శనికతను నెరవేరుస్తున్నారని పేర్కొన్నారు. ఓటు బ్యాంకుల కోసం భారతీయులను కులం, మతం ఆధారంగా విభజించడం ద్వారా కాంగ్రెస్ మనుగడ సాగిస్తుందని విమర్శించారు.

## అమెరికాకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. తమ దేశ అత్యున్నత నేత అయతొల్లా అలీ ఖమేనీపై ఎలాంటి దాడి జరిగినా దానిని ఇరాన్ జాతిపై సంపూర్ణ యుద్ధంగా పరిగణిస్తామని ఇరాన్ అమెరికాకు తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఇరు దేశాల మధ్య మాటల యుద్ధం రోజురోజుకీ ఉధృతమవుతున్న నేపథ్యంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

### ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటు స్పందన

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఇరాన్‌లో కొత్త నాయకత్వం రావాల్సిన సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆదివారం ‘ఎక్స్’ వేదికగా తీవ్రంగా మండిపడ్డారు. ఇరాన్‌పై ఎలాంటి దురాక్రమణకు పాల్పడినా మేం తీవ్రంగా ప్రతిఘటిస్తాం. మా దేశ గొప్ప నాయకుడిపై దాడి చేయడం అంటే ఇరాన్ జాతితో సంపూర్ణ యుద్ధానికి దిగడమే అని స్పష్టం చేశారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు నోటీసులు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సోమవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కారణ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. వీరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరింది. ఆయన స్పందించపోవడంతో ఆ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను కోర్టు ఆదేశించింది. ఆ గడువు ముగిసినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదు. దీంతో గతంలో కేటీఆర్ స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. తాజాగా మహేశ్వర్‌రెడ్డి ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీంతో ఇదే కేసులో కేటీఆర్ దాఖలు చేసిన ప్రధాన పిటిషన్‌తో ఈ పిటిషన్‌ను జత చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అనంతరం స్పీకర్‌కు నోటీసులు జారీ చేసి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది.

## దావోస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి

**అక్షరటుడే, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరారు. అక్కడ జరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొంటారు. దావోస్ పర్యటనలో మంత్రులు డి. శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి ఉంటారు. జనవరి 20 నుంచి నాలుగు రోజుల డబ్ల్యూఈఎఫ్ సదస్సులో సీఎం పాల్గొంటారు. ప్రముఖ కంపెనీల సీఈవోలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, వివిధ రంగాల ప్రతినిధులతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తారు. గూగుల్, సేల్స్‌ఫోర్స్, యునిలీవర్, హనీవెల్, లోరియల్, నోవార్టిస్, టాటా గ్రూప్, డీపీ వరల్డ్, ఇన్ఫోసిస్, సిస్కో వంటి ప్రముఖ ప్రపంచ కార్పొరేషన్ల అధిపతులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తారు. పలు రౌండ్‌టేబుల్ చర్చల్లో కూడా పాల్గొంటారు.

## స్పెషల్ సాంగ్స్‌కు ఓకే..

**నేషనల్ క్రష్ రష్మిక మందన్నా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఓ చిట్‌చాట్‌లో ఆమె అభిమానులతో మాట్లాడారు. అన్ని రకాల చిత్రాల్లో తాను నటిస్తానని ఈ ముద్దుగుమ్మ చెప్పుకొచ్చింది. తనపై వచ్చే రుమార్లపై ఆమె స్పందించారు. వ్యూస్‌తో డబ్బు సంపాదించడానికి తనపై కొందరు నెగిటివ్‌గా రాస్తారని పేర్కొన్నారు. తాను స్పెషల్ సాంగ్స్‌లో సైతం నటిస్తానని రష్మిక చెప్పుకొచ్చారు. అయితే ఆ సినిమాలో తానే హీరోయిన్ అయి ఉండాలని కండీషన్ పెట్టారు. లేకపోతే ప్రముఖ దర్శకుల సినిమాల్లో ఐటెం సాంగ్ ఆఫర్ వస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.**

**-అక్షరటుడే, సినిమా డెస్క్**

